ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



మహబూబ్‌నగర్

జిల్లా వార్తలు

సోమవారం 18 నవంబరు 2024

ఉష్ణోగ్రతలు గరిష్ఠం: 24.0 । కనిష్ఠం: 21.0



మహబూబ్‌నగర్‌లోని ఓ పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థులు



ఇంటికో అంజన్న

ఆ ఊరంతా హనుమాన్ భక్తులే
ఆవుపేడ పిడకలతో
స్వామి వారికి దీపారాధన
రూ. 50 లక్షలతో గుడి నిర్మాణం 7



మోసగాళ్లు

రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తానని
రూ. 6.40 లక్షలు స్వాహా
నిరుద్యోగులను
మోసగిస్తున్న కేటుగాళ్లు 7



మార్షల్ ఆర్ట్సలో రాణించాలి

ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలి
డీఎస్పీ వెంకటేశ్వర్లు
మహబూబ్‌నగర్‌లో ఉత్సాహంగా
అంతర్రాష్ట్ర కరాటే పోటీలు 7



మహబూబ్‌నగర్‌లో పరీక్ష కేంద్రానికి వస్తున్న అభ్యర్థిని



మహబూబ్‌నగర్‌లోని ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రం వద్ద నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు



మహబూబ్‌నగర్‌లోని ఓ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ విజయేందిరబోయి

గ్రూప్ 3 మొదటి రోజు..
ప్రశాంతం

- మహబూబ్‌నగర్ జిల్లాలో 52, నారాయణపేట జిల్లాలో 13 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- రెండు జిల్లాల్లో 23,489 మంది అభ్యర్థులు
- కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్లు, ఎస్పీలు

నేడు పేపర్-3 పరీక్ష

పేపర్-3 పరీక్ష సోమవారం ఉదయం 10 గంటల నుంచి 12:30 గంటల వరకు నిర్వహించనున్నారు. 52 కేంద్రాల్లో ఎగ్జామ్ జరుగనుంది.

మహబూబ్‌నగర్ విద్యావిభాగం/నారాయణపేట/నారాయణపేట టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో గ్రూప్-3 పరీక్ష మొదటి రోజు ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. మహబూబ్‌నగర్ జిల్లాలో 52, నారాయణపేట జిల్లాలో 13 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేంద్రాల వద్ద ఉదయం ఎనిమిది గంటల నుంచే సందడి నెలకొంది. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. కేంద్రలకు సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసి వేశారు. ఎక్కడా చిన్నతప్పిదం కూడా జరుగకుండా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. అభ్యర్థుల రాకపోకల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపింది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం లోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల కేంద్రం వద్దకు చివరి నిముషంలో పరుగున వచ్చిన అభ్యర్థిని స్పృహ కోల్పోవడంతో, పోలీసులు ఆమె కిందపడకుండా పట్టుకుని, కేంద్రం లోపలికి చేర్చారు.

కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

మహబూబ్‌నగర్‌లో పరీక్ష కేంద్రాలను కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ జానకి పరిశీలించారు. ఉదయం పేపర్-1కు సంబంధించి జయప్రకాష్ నారయణ్ ఇంజనీరింగ్ కళాశాల, అల్ మదీనా, పాలమూరు యూనివర్సిటీ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల కేంద్రాలను, మధ్యాహ్నం జరిగిన పేపర్-2 పరీక్షకు సంబంధించి మౌంట్ బాసిల్ పాఠశాల, ఎంవీఎస్ డిగ్రీ కళాశాల కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. పొరపాట్లు జరుగొద్దన్నారు. అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. జిల్లా ఎస్పీ జానకి కూడా పలు కేంద్రాలను పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పొరపాట్లకు తావివ్వొద్దు: సిక్తా పట్నాయక్

నారాయణపేట జిల్లాలో 13 కేంద్రాల్లో పరీక్షను నిర్వహించారు. కేంద్రాలను కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రవితేజ ఉన్నత పాఠశాల, ద్వారక పాఠశాల కేంద్రాలను కలెక్టర్ సిక్తా పట్నాయక్, చిట్టెం నర్సిరెడ్డి మెమోరీయల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్ పరీక్షా కేంద్రాలను ఎస్పీ యోగేష్ గౌతమ్ తనిఖీ చేశారు. సిబ్బందికి సూచనలు చేశారు. సోమవారం నాటి పరీక్షను సైతం ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా నిర్వహించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ చెప్పారు. డీఎస్పీ లింగయ్య పర్యవేక్షించారు. పలువురు తల్లులు పరీక్షకు వెళ్లడంతో చిన్నారులను కేంద్రాల సమీపంలో కుటుంబీకులు ఆడించారు.

హాజరు.. గైర్హాజరు ఇలా..

మహబూబ్‌నగర్ జిల్లా: రెండు రోజులు పాటు జరిగే గ్రూప్-3 పరీక్షకు మూడు పేపర్స్ ఉండగా, మొదటి రోజు ఆదివారం రెండు పరీక్షలు పూర్తయ్యాయి. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు పేపర్-1 పరీక్షకు 19,465 మందికి గాను 10,646 మంది హాజరయ్యారు. 8,819 మంది గైర్హాజరు అయ్యారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం 5:30 వరకు నిర్వహించిన పేపర్-2 పరీక్షకు 19,465 మందికి గాను 10,538 మంది హాజరు కాగా, 8,927 మంది అభ్యర్థులు గైర్హాజరు అయ్యారు.

నారాయణపేట జిల్లా: నారాయణపేట జిల్లాలో పేపర్ 1 పరీక్షకు 4,024 మంది అభ్యర్థులకు గాను 2,353 మంది హాజరయ్యారు. 1671 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం పేపర్ 2 పరీక్షకు 4,024 మందికి గాను 2,354 మంది హాజరు కాగా, 1,670 మంది గైర్హాజరు అయ్యారు.



జూరాల ప్రాజెక్టు ముందు భాగంలో తేలిన రాళ్లు (ఫైల్)

జూరాలలో తగ్గుతున్న
నీటి సామర్థ్యం

- ప్రాజెక్టులో పేరుకుపోతున్న పూడిక
- పట్టించుకోని పాలకులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్నరైతులు

6

ఉమ్మడి జిల్లా వరప్రదాయినగా పిలువబడే ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టులో పూడిక పేరుకుపోతోంది. దీంతో ఈ ప్రాజెక్టులో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతోంది. దీంతో భవిష్యత్‌లో నీటి కష్టాలు ఏర్పడే ప్రమాదం పొంచిఉన్నది. ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసి 30 ఏళ్లు దాటినా నేటికి ఒక్కసారి కూడా పూడిక తీయకపోవడం గమనార్హం. ఎగువ నుంచి భారీస్థాయిలో బురద, రాళ్లు, మట్టి తదితర వ్యర్థాలు వరద నీటిలో కొట్టుకొచ్చి ప్రాజెక్టులో కూరుకుపోతున్నాయి. అధికారుల లెక్క ప్రకారం జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ 11.46 టీఎంసీలు, ప్రస్తుతం 2.50 నుంచి 3 టీఎంసీల మేరకు ప్రాజెక్టులో పూడిక పేరుకుపోయిందని చెప్పవచ్చు. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి ఈ ఏడాదైనా పూడిక తీసే పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

- అమరచింత, ఆంధ్రజ్యోతి

అందరి సహకారంతో సాఫీగా సర్వే

- కుల గణనపైనే ఫోకస్ చేస్తున్నాం
- ఆస్తులు, అప్పుల విషయాలపై ఒత్తిడి తేవడం లేదు
- నారాయణపేట జిల్లా ప్రణాళికా అధికారి యోగానంద్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

నారాయణపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అందరి సహకారంతో నారాయణపేట జిల్లాలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల, సమాచార సేకరణ సమగ్ర ఇంటింటి సర్వే సాఫీగా సాగుతోందని జిల్లా ప్రణాళిక అధికారి ఎస్.యోగానంద్ చెప్పారు. ఆదివారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఆ వివరాలు..

సర్వే ఎప్పుడు ప్రారంభమైంది? ఎంత వరకొచ్చింది?

జిల్లా వ్యాప్తంగా ఈ నెల ఆరు నుంచి సర్వేను ప్రారంభమైంది. మూడు రోజులు నివాసాలు, కుటుంబ యజమానులను గుర్తించి ఇళ్లకు స్టిక్కర్లు అతికించాం. తర్వాత వివరాలు సేకరిస్తున్నాం. 12 రోజుల్లో 17వ తేదీ వరకు 1,06,326 నివాసాల సర్వే చేపట్టాం. గ్రామీణ ప్రాంతాల్లో 90,042 నివాసాలు, మూడు మునిసిపాలిటీల్లో 16,284 నివాసాల సర్వే చేశాం. జిల్లాలో 68.2 శాతం సర్వే పూర్తయ్యింది.

జిల్లాలో ఎన్ని బ్లాకులు ఏర్పాటు చేశారు? ఎంత మంది సిబ్బంది పాల్గొంటున్నారు?

జిల్లా వ్యాప్తంగా 280 గ్రామ పంచాయతీలు, మూడు మునిసిపాలిటీల్లో 1,55,894 నివాసాలు ఉన్నాయి. 1,193 బ్లాకులను ఏర్పాటు చేశాం. సర్వే కోసం 1,170 మంది ఎన్యుమరేటర్లు, 118 మంది సూపర్‌వైజర్లు, పది శాతం అదనపు సిబ్బందితో మొత్తం 1,432 మంది సర్వేలో పాల్గొంటున్నారు. 150 ఇళ్లకు ఒక ఎన్యుమరేటర్‌ను ఏర్పాటు చేశాం. సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేందుకు 303 మంది కంప్యూటర్ ఆపరేటర్లు పని చేస్తున్నారు.

ఆస్తుల వివరాలు చెప్పేందుకు ప్రజలు భయపడుతున్నారని తెలిసింది. ఈ విషయం మీ దృష్టికి వచ్చిందా?

అలాంటిదేం లేదు. ముఖ్యంగా కుల గణనపైన ఫోకస్ పెట్టాము. ఆస్తులు, అప్పుల వివరాలపై ఎన్యుమరేటర్లు ఒత్తిడి చేయడం లేదు. సర్వేకు ప్రజలు సహకరిస్తున్నారు. సర్వే వల్ల ఎలాంటి నష్టం ఉండదని భరోసా కల్పిస్తున్నాం.

ఏయే అంశాలు ప్రధానంగా సేకరిస్తున్నారు?

ఉపాధి, విద్య, ఉద్యోగ అంశాలకు సంబంధించిన అంశాలు కచ్చితంగా సేకరిస్తున్నాం. దాంతోపాటు రాజకీయ అంశాలను పరిగణలోకి తీసుకుంటున్నాం.

నేడు జడ్చర్ల మునిసిపల్
చైర్‌పర్సన్ ఎన్నిక

- కౌన్సిలర్‌లతో మాట్లాడి నిర్ణయం తీసుకోనున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి



జడ్చర్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక సోమవారం పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో చేపట్టనున్నారు. చైర్‌పర్సన్ ఎన్నిక సందర్భంగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్‌లు ఇప్పటికే క్యాంపునకు తరలివెళ్లారు. నలుగురి మధ్య పోటీ ఉండగా, ప్రధానంగా ఇద్దరి మధ్యనే అధిక పోటీ ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. జడ్చర్ల మునిసిపల్ చైర్‌పర్సన్‌గా ఉన్న దోరేపల్లి లక్ష్మిపై కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టి, పదవి నుంచి దింపేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం అదే పార్టీకి చైర్‌పర్సన్‌ను ఎన్నుకునే మెజారిటీ ఉంది. ఈ ఎన్నికలో సామాజిక న్యాయం పాటించేలా చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. ఈ విషయంలో జోక్యం చేసుకోకుండ ఉన్న మాజీ మంత్రి సి.లక్ష్మారెడ్డి, తాజాగా కౌన్సిలర్‌ల అభ్యర్థన మేరకు వారితో చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది. జడ్చర్ల మునిసిపాలిటీలో 27 మంది కౌన్సిలర్‌లు ఉన్నారు. 23 మంది బీఆర్ఎస్ నుంచి, కాంగ్రెస్, బీజేపీ నుంచి చెరో ఇద్దరు గెలుపొందారు. ఇటీవల బీఆర్ఎస్, బీజేపీ నుంచి ఐదుగురు కౌన్సిలర్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాగా చైర్‌పర్సన్ ఎన్నికలో బీఆర్ఎస్ విప్ జారీ చేయనున్నట్లుగా ఇప్పటికే ఆ పార్టీ నాయకులు ప్రకటించిన విషయం విదితమే. చైర్‌పర్సన్ ఎవరు అవుతారనే అంశంపై సర్వతా ఆసక్తిగా నెలకొంది.



దున్నపోతులతో విన్యాసాలు చేయిస్తున్న యువకులు

ఏటా ఘనంగా సదర్ ఉత్సవాలు

- ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ సంవత్సరం సదర్ ఉత్సవాలను ఘనంగా జరుపుకుందామని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి పిలుపునిచ్చారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో జడ్చర్ల పట్టణంలోని నేతాజీ చౌరస్తాలో ఆదివారం నిర్వహించిన సదర్ ఉత్సవంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. పట్టణంలోని చౌడమ్మగుట్ట వద్ద ఉన్న ఎకరా ప్రభుత్వం స్థలాన్ని యాదవ సంఘానికి కేటాయిస్తున్నానని చెప్పారు. అందుకు సంబంధించిన సిఫారసు పత్రంపై సంతకం చేసి, నాయకులకు అందించారు. సంఘం భవనానికి స్వంతంగా రూ.5 లక్షలు అందించనున్నట్లు ప్రకటించారు. సదర్ ఉత్సవాలను అందరం అన్నదమ్ముల్లా పండుగ వాతావరణంలో జరుపుకుందామన్నారు. హైదరాబాద్, జడ్చర్ల పరిసర ప్రాంతాల నుంచి యాదవులు తెచ్చిన దున్నపోతులతో విన్యాసాలు చేయించారు. పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో హాజరై తిలకించారు. ఉత్సవాల్లో మాజీ మంత్రులు డాక్టర్ సి.లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, యాదవ సంఘం నాయకులు విశ్వేశ్వర్, గిరియాదవ్, శ్రీశైలం యాదవ్, ప్రభాకర్ యాదవ్ పాల్గొన్నారు.




గోవులకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జాతరెళ్లిపోదాం..

- కురుమూర్తి బ్రహ్మోత్సవాల్లో జనమే జనం



జాతరలోని దుకాణాల వద్ద కొనుగోలుదారులు



ప్రధాన ద్వారం వద్ద భక్తుల సందడి

చిన్నచింతకుంట, నవంబరు 17: కలియుగ ప్రత్యేక్ష దైవం, పేదల తిరుపతిగా పేరొందిన కురుమూర్తిస్వామి జాతరకు ఆదివారం భక్తులు తండోపతండాలుగా వచ్చారు. సెలవుదినం కావడంతో భక్తుల సంఖ్య పెరిగింది. జాతర మైదానంలో ఎటు చూసినా భక్తులే కనిపించారు. స్వామిని దర్శించుకొని, దాసంగాలతో నైవేద్యం పెట్టారు.

రంగుల రాట్నాల వద్ద రద్దీ

జాతరలో వెలిసిన రంగుల రాట్నాల వద్ద రద్దీ ఉంటోంది. వివిధ రకాల సర్కస్‌లను తిలకించేందుకు, వివిధ రైడ్‌లు చేసేందుకు చిన్నారులు ఆసక్తి చూపుతున్నారు. గాజులతో పాటు తినుబండారాల దుకాణాలు కిటకిటలాడుతున్నాయి.

ఐజీ సుమతికి పితృ వియోగం

● కలుగొట్లలో విషాదం ● అంత్యక్రియలకు రానున్న ఇంటెలిజెన్స్ డీజీపీ



తండ్రి భౌతికకాయం వద్ద విషణ్ణ వదనంతో ఐజీ సుమతి

అలంపూర్ చౌరస్తా, నవంబరు 17, (ఆంధ్ర జ్యోతి) : తెలంగాణ ఇంటిలిజెన్స్ ఐజీ బదుగుల సుమతి ఇంట విషాదం నెలకొంది. ఆమె తండ్రి తిరుపతిరెడ్డి (74) వయోభారంతో ఆదివారం తెల్లవారుజామున హైదరాబాదులోని తన నివాసంలో మృతి చెందారు. దీంతో అయన స్వగ్రామమైన జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండలం, కలుగొట్ల గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. తిరుపతిరెడ్డి గతంలో కలుగొట్ల గ్రామానికి రెండు పర్యాయాలు సర్పంచుగా, జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్‌గా కొనసాగారు. ఆదివారం ఉదయం ఆయన మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చారు. సోమవారం నిర్వహించనున్న అంత్యక్రియలకు ఇంటలిజెన్స్ డీజీపీ శివధర్ రెడ్డి రానున్నట్లు తిరుపతిరెడ్డి కుమారుడు నరేందర్‌రెడ్డి తెలిపారు. అయనకు అయిదుగురు సంతానం కాగా, మూడవ సంతానమైన సుమతి అంచెలంచెలుగా ఎదిగి నేడు ఐజీ స్థాయిలో ఉన్నారు. నాన్నకు తానంటే అమితమైన ప్రేమ అని, శనివారం తన పుట్టిన రోజు సందర్భంగా ఆయన అశీస్సులు కూడా తీసుకున్నానని సుమతి ఆవేదనతో తెలిపారు.

పూర్వ వైభవం వచ్చేనా?



శిథిలావస్థలో మైలారం శివాలయం



చెట్ల పొదల్లో శివలింగం

● శిథిలావస్థలో పలు ఆలయాలు
● ధూపదీప నైవేద్యాలు కరువు

బల్మూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు భక్తిశ్రద్ధలతో దేదీప్యమానంగా వెలిగిన దేవాలయాలు నేడు దీనావస్థలో దర్శనమిస్తున్నాయి. మండలంలోని పురాతన దేవాలయాలు శిథిలమవుతున్నాయి. మండలంలో ఎక్కువగా నవాబులు, రాజులు, కాకతీయుల కాలం నాటి శివాలయాలు ఉన్నాయి. మైలారం, కొండనాగుల చెన్నకేవవస్వామి ఆలయాలు ఆలనపాలన చూసే వారు లేక శిథిలంగా మారుతున్నాయి. బాణాల, బిల్లకల్, గోదల్ గ్రామాలలో శివాలయాలు ఉన్నాయి. మైలారం శివాలయాన్ని (వీరన్నపల్లి)కి ఎంతో ప్రాముఖ్యత ఉంది. నెర్రెలు వచ్చి కుంగిపోయింది. పక్కనే ఉన్న చాముండేశ్వరీ, చెన్నకేశవ దేవతామూర్తుల విగ్రహాల గుప్త నిధుల కోసం గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. గుళ్లను బాగు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

గ్రూప్ 3 సందడి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదివారం గ్రూప్ 3 పరీక్షను నేపథ్యంలో జిల్లా కేంద్రాలు కిటకిటలాడాయి. ఉదయం నుంచే అన్ని కేంద్రాల వద్ద సందడి నెలకొంది. పోలీసులు అన్ని కేంద్రాలను పకడ్బందీగా తనిఖీ చేశారు. సమయం దగ్గర పడుతుండటంతో అభ్యర్థులు కేంద్రాలకు పరుగులు పెట్టారు. సమయం గడిచిపోయాక వచ్చిన వారిని అనుమతించకపోవడంతో నిరాశగా వెనుదిరిగారు. పలువురు అభ్యర్థుల చిన్నారులను ఆడించేందుకు కుటుంబ సభ్యులు పాట్లు పడ్డారు.

-ఆంధ్రజ్యోతి , నెట్‌వర్క్



నారాయణపేటలో కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థులు



వనపర్తిలో చిన్నారికి ఊయల కట్టి ఆడిస్తున్న మహిళ



మహబూబ్‌నగర్‌లో హాల్‌టికెట్లు పరిశీలిస్తున్న ఎస్పీ జానకి



మహబూబ్‌నగర్‌లో ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల కేంద్రం వద్ద నిలిపిన అభ్యర్థుల వాహనాలు





మహబూబ్‌నగర్‌లో పరీక్షకు వస్తున్న వికలాంగుడు, నారాయణపేటలో ఓ కేంద్రం వద్ద పోలీసుల పహారా



వనపర్తిలో హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు



హాల్ టికెట్ నంబరు చూసుకునేందుకు వనపర్తిలో వికలాంగురాలికి సాయం చేస్తున్న కానిస్టేబుల్





నారాయణపేట, వనపర్తిలలో చిన్నారులను ఆడిస్తున్న మహిళలు



మహబూబ్‌నగర్‌లో చిన్నారితో పరీక్షకు వచ్చిన అభ్యర్థిని





వనపర్తిలో సమయం గడిచిపోవడంతో అనుమతించని అభ్యర్థులు

చర్మ వ్యాధులతో పీటీజీ విద్యార్థుల అవస్థలు



ముఖానికి దద్దుర్లు వచ్చిన విద్యార్థి ధనుష్

మన్ననూర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అమ్రాబాద్ మండలంలోని మన్ననూరు ఆదివాసీ గురుకుల విద్యాలయం (పీటీజీ)లో చర్మ సంబంధ వ్యాధులు సోకి చెంచు విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పీటీజీ గురుకులంలో 350 మంది విద్యార్థులుండగా 50 మందికి పైగా విద్యార్థులకు గజ్జి, తామర వంటి వ్యాధులతో ఇబ్బంది పడుతున్నా గురుకులం నిర్వాహకులు పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లి దండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో విద్యార్థులకు ప్రత్యేకంగా ప్రైయివేటుగా మందుల కేటాయింపు ఉండేదని, ప్రస్తుతం విద్యార్థులకు తామే తీసుకుకెళ్లి వైద్యం అందించే పరిస్థితి దాపురించిందన్నారు. ప్రభుత్వ వైద్యాధికారులు పాఠశాలలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయడం లేదని విద్యార్థులు ముక్తేష్, బాందన్, ధనుష్‌లు తెలిపారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ గోవర్ధన్ మాట్లాడు తూ విద్యార్థులు చర్మవ్యాధులకు గురవుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని వైద్య పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు.

జూరాలలో తగ్గుతున్న నీటి సామర్థ్యం

● ప్రాజెక్టులో పేరుకుపోతున్న పూడిక



జూరాల ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో తగ్గుతున్న నీటి నిల్వ సామర్థ్యం

అమరచింత, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోని అత్యధిక ప్రాంతాలకు తాగు, సాగు నీటిని అందించే ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యాన్ని కోల్పోతోంది. ఈ ప్రాజెక్టు నిర్మించి 30 ఏళ్లు దాటినా పూడిక తీతకు నోచుకోలేదు. నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతూ వస్తుండడంతో భవిష్యత్‌లో ఆందోళనకర పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉంది. కృష్ణానదిపై ఉమ్మడి జిల్లాలో మొట్టమొదటి ప్రాజెక్టు అయిన జూరాలపై ప్రజాప్రతినిధులు ఎందుకింత నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జూరాల ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసి 30 ఏళ్లు దాటినా నేటికి ఒక్కసారి కూడా పూడిక తీయలేదు. ఎగువ నుంచి భారీస్థాయిలో బురద, రాళ్లు, మట్టి తదితర వ్యర్థాలు వరద నీటిలో కొట్టుకొచ్చి ప్రాజెక్టులో పేరుకుపోతున్నాయి. అధికారుల లెక్క ప్రకారం జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ 11.46 టీఎంసీలు, ప్రస్తుతం 2.50 నుంచి 3 టీఎంసీల మేరకు ప్రాజెక్టులో పూడిక పేరుకుపోయిందని చెప్పవచ్చు.

జఠిలమైన పూడిక సమస్య..

జూరాల ప్రాజెక్టు పూడిక సమస్య జఠిలంగా మారుతోంది. వర్షాభావ పరిస్థితి ఏర్పడినప్పుడు జూరాల ప్రాజెక్టుపై ఆధారపడితే నిల్వ నీటి సామర్థ్యం తగ్గుతూ వస్తుండడంతో నీటి సమస్య పొంచి ఉంటుందని చెప్పవచ్చు. ఉమ్మడి జిల్లాలో మెజార్టీ నియోజక వర్గాలకు తాగునీరు ఈ ప్రాజెక్టు ద్వారానే సరఫరా చేస్తున్నారు. అయినా ప్రజా ప్రతినిధులు, అధికారులు ఈ ప్రాజెక్టులో పేరుకుపోయిన పూడికపై దృష్టి సారించడం లేదు. ముఖ్యంగా వేసవి కాలంలో ప్రాజెక్టులో నీటి నిల్వ శాతం కన్నా పూడిక శాతం ఎక్కువ కనిపిస్తుంది. 2013-14 సంవత్సరంలో ప్రాజెక్టు ఆధునికీకరణలో భాగంగా ప్రాజెక్టు నీటిని ఖాళీ చేయించారు. అప్పుడే పూడిక సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి ప్రత్యేక యంత్రంతో ద్వారా పూడికను తొలగించి ఉంటే ప్రస్తుతం ఈ సమస్య ఇంత జఠిలం అయ్యేది కాదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఈ విషయంపై జూరాల ప్రాజెక్టు ఈఈ జుబేర్ అహ్మద్‌ను వివరణ కోరగా ప్రాజెక్టులో మూడు టీఎంసీల మేరకు పూడిక ఉన్న విషయం వాస్తవమే. ఈ విషయంపై ఉన్నత అధికారులకు నివేదిస్తామని తెలిపారు.

క్రస్టు గేట్లు మూసినందుకే పూడిక శాపం

ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి పాలకులు జూరాల ప్రాజెక్టు క్రస్టు గేట్లను మూసివేశారు. 50 శాతం జూరాల ప్రాజెక్టు పూడిక క్రస్టు గేట్ల ద్వారా దిగువకు పోతుందని, ఆంధ్రలో ఉన్న శ్రీశైలం ప్రాజెక్టుకు ఇబ్బంది అవుతుందనే కుట్రతో జూరాల ప్రాజెక్టు క్రస్టు గేట్లను మూయించేశారు. అందుకే జూరాలలో మూడు టీఎంసీల మేరకు పూడిక చేరింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా పూడికతీతపై దృష్టి సారించాలి.

- మోదీ మనోహర్ రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు, అమరచింత

తక్షణమే పూడిక తొలగించాలి

ప్రాజెక్టు నిర్మించినప్పటి నుంచి నేటి వరకు పూడిక తొలగించక పోవడం విచారకరం. ఉమ్మడి జిల్లా వరప్రదాయిని అయిన జూరాల ప్రాజెక్టుకు పాలకులు ప్రత్యేక నిధులు కేటాయించి పూడికను తక్షణం తొలగించాలి. రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్వహణపై దృష్టి సారించాలి.

- హన్మంతు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు, నందిమల్ల

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

గోపాల్‌పేట, నవంబర్ 17 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని చోటుచేసుకుంది. మృతుడు సోదరుడు, గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలంలోని కిష్టగిరి తండాకు చెందిన ముడావత్ పీర్యానాయక్, మౌని దంపతుల చిన్న కుమారుడు ముడావత్ కిషోర్ (23)కు మూడు సంవత్సరాల కిందట మండలంలోని బుద్దారం గ్రామ శివారులోని జాంప్లా తండాకు చెందిన సరితతో వివాహమైంది. వీరికి ప్రస్తుతం ఒక సంవత్సరం కుమారుడు ఉన్నాడు. భార్యాభర్తల మధ్య చిన్నచిన్నగొడవలు చోటుచేసుకుంటున్నాయి. పలుమార్లు పెద్దలతో పంచాయితీ పెట్టినా.. మళ్లీ గొడువ పడుతూనే ఉన్నారు. దీంతో సరిత జాంప్లాతండాలో తల్లి వారి ఇంటి వద్ద ఉంటుంది. కిషోర్ హైదరాబాద్‌లో పనిచేసుకుంటూ ఉంటున్నాడు.

శనివారం మధ్యాహ్నం సమయంలో కిషోర్ హైదరాబాద్ నుంచి కుమారుడిని చూసేందుకు వచ్చాడు. అనంతరం బుద్దారం గ్రామంలోకి బైక్ పై వచ్చి జాంప్లా తండాకు తిరుగు ప్రయాణంలో బుద్దారం రైస్‌మిల్లు సమీపంలో కిషోర్ బైక్‌పై అతి వేగంతో వచ్చి రోడ్డు పక్కకు దుసుకెళ్లి పక్కనే ఉన్న స్తంభానికి బలంగా ఢీకొట్టాడు. తలకు బలమైన గాయమవడంతో గ్రామస్థులు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. గాయాలతో పడి ఉన్న కిషోర్‌ను వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం నిమిత్తం కర్నూల్ ఆసుపత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో మృతిచెందాడు. మృతదేహాన్ని కిషోర్ స్వగ్రామానికి తరలించారు.

భగవంతుడిని తెలుసుకోవడమే జ్ఞానం

● శ్రీపీఠం ఆశ్రమం పీఠాధిపతి పరిపూర్ణానందసరస్వతి స్వామి
● ముగిసిన శ్రీరుద్రసహిత శతచండీ యాగం
● ఘనంగా పూర్ణాహుతి, పాల్గొన్న పీఠాధిపతులు, ఎంపీ డికె అరుణ



మలయాళ లక్ష్మీనారాయణ ఆశ్రమంలో పూర్ణాహుతికి హాజరైన పాలమూరు ఎంపీ డీకే అరుణ

జడ్చర్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): భగవంతుడిని తెలుసుకోవడమంటేనే జ్ఞానాన్ని పొందడమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడ శ్రీపీఠం పీఠాధిపతి పరిపూర్ణానందసరస్వతిస్వామి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం గంగాపురం మలయాళ లక్ష్మీనారాయణ ఆశ్రమంలో మూడు రోజుల పాటు నిర్వహించిన శ్రీరుద్రసహిత శతచండీ యాగం ముగింపు సందర్భంగా ఆదివారం నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు ప్రవచనాలు చేశారు. అనంతరం మాట్లాడుతూ పంచభూతాలైన అగ్ని, జలం, వాయువు, భూమి, ఆకాశాలను సంరక్షణ చేస్తూ లోక కల్యాణానికి ఉపయోగపడే రీతిగా మానవులంతా కృతజ్ఞత చూపాలని సూచించారు. పంచభూతాలను సంరక్షిస్తే సర్వజీవుల రక్షణ జరుగుతుందన్నారు. ఆశ్రమ 20వ వార్షికోత్సవం కార్యక్రమంలో భాగంగా మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న శతచండీ పూజలు ఘనంగా నిర్వహించారు. ఆశ్రమంలో ఉదయం గీతాపారాయణం, శివ పార్వతుల కల్యాణాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. పూర్ణాహుతి కార్యక్రమంలో పాలమూరు ఎంపీ డీకే అరుణ పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఏర్పేడు వ్యాసాశ్రమం పీఠాధిపతి పరిపూర్ణానంద గిరిస్వామి, ఆశ్రమం పీఠాధిపతి పరమాత్మనందగిరి స్వామి, భక్తులు పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు

-హుటాహుటిన హైదరాబాద్ ఆసుపత్రికి తరలింపు

అచ్చంపేటటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వీధికుక్కల దాడిలో చిన్నారికి గాయాలైన సంఘటన ఆదివారం నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని టంగాపూర్ కాలనీలో చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన రవి కుమారుడు కాలనీలో అడుకుంటుండగా వీధికుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. గమనించిన కుటుంబ సభ్యులు చిన్నారిని వెంటనే ప్రభుత్వ సివిల్ ఆసుపత్రికి తరలించారు. కుక్కలు దాడిచేయడంతో చిన్నారికి తలపై తీవ్ర గాయాలయ్యాయి. వైద్యం అందించిన డాక్టర్లు తలకు తీవ్ర గాయాలు కావడంతో చిన్నారికి మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని సూచించారు. కుటుంబసభ్యులు హుటాహుటిన హైదరాబాద్ ఆసుపత్రికి తరలించి చిన్నారికి వైద్యం అందించారు. ప్రస్తుతం చిన్నారి ఆర్యోగం నిలకడగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.



కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన బాలుడు

క్రైం కార్నర్

రైలు ఢీకొని పంచాయతీ కార్మికుడి మృతి

నర్వ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రమా దవశాత్తు రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం ఉదయం మహబూబ్‌న గర్ జిల్లా దేవరకద్ర వద్ద జరిగింది. పూర్తి వి వరాలు ఇలా ఉన్నాయి. నర్వ మండల కేంద్రా నికి చెందిన నర్సింహులు(45) గ్రామ పంచా యతీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. జాతరకు అని శుక్రవారం గ్రామ పం చాయతీలో సెలవు తీసుకుని కురుమూర్తికి వెళ్లాడు. అక్కడి నుంచి దేవ రకద్ర మీదుగా నర్వకు వద్దామని బస్టాండులో దిగి అక్కడ రైలు పట్టాలపై బహిర్భూమికి వెళ్లిన క్రమంలో రైలు ఢీకొట్టడంతో అక్కడికి అక్కడే పడి మృతి చెందాడని మృతుడి బామ్మార్ది రవి తెలిపారు. పంచనామా కోసం పోలీసులు శవాన్ని మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

నిర్లక్ష్యంగా కారు డ్రైవింగ్.. మహిళ మృతి


జిలుగపెల్లి నిరంజనమ్మ (ఫైల్)

పెద్దకొత్తపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యంగా కారు డ్రైవింగ్ చేస్తూ ఓ నిండు ప్రాణం బలిగొన్నారు. ఈ సంఘటన నాగర్ కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం కల్వకోల్ బస్టాండ్ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కొల్లాపూర్ మండలం కుడికిళ్ల గ్రామానికి చెందిన జిలుగపల్లి నిరంజనమ్మ (56)తన పుట్టింటికి ముష్టిపల్లి గ్రామానికి శని వారం వెళ్లింది. తిరిగి ఆదివారం స్వగ్రామానికి ప్రయాణమై ముష్టిపల్లి స్టేజీ వద్ద బస్సు ఎక్కి కల్వకోల్ వద్ద బస్సు దిగింది. అక్కడి నుంచి ఆమె స్వగ్రామం కుడికిళ్లకు రోడ్డు పక్క నుంచి కాలి నడకన వెళ్తుండగా హైదరాబాద్ నుంచి కారు అతి వేగంగా కొల్లాపూర్ వైపు వెళ్తూ వెనుక నుంచి ఆమెను ఢీకొట్టింది. దీంతో కారు వేగానికి ఆమె ఎగిరిపడి అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది.

అయితే సదరు కారులో ప్రయాణించిన వారిలో ఇద్దరు యువతులు, మరో ఇద్దరిలో ఒకరు ప్రొఫెసర్, మరొకరు అడ్వకేట్ ఉన్నట్లు తెలుస్తోంది. అయితే తమకు న్యాయం చేయాలని కోరుతూ మృతురాలి కుటుంబీకులు సంఘటన చోటే శవంతో టెంట్ వేసుకొని ఆందోళనకు దిగారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు ఆందోళన శిబిరానికి చేరుకొని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఏఎస్ఐ బాలనారాయణకు సూచించారు. మధ్యాహ్నం తరువాత పోస్టుమార్టం కోసం శవాన్ని నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

కుక్కల దాడిలో 30 గొర్రె పిల్లలు మృతి

మానవపాడు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కుక్కల దాడిలో 30 గొర్రె పిల్లలు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండల పరిధిలోని జల్లాపురం గ్రామానికి చెందిన గొల్ల రాముడు తండ్రి రోషన్న వీరికి 1500 వందల గొర్రెల మంద జీవాలు ఉన్నాయి. వీటిలో చిన్న, సన్న పిల్లలు 300 వందల దాకా ఉంటాయి. ఈ మందను ఓ రైతు పొలంలో ఆపారు. వీటి మేత కోసం కాపరి మరో పొలం దగ్గరకు వెళ్లడంతో ఎటునుంచి వచ్చాయో తెలియదు కానీ రెండు కుక్కలు కంచె లోపలికి వెళ్లాయి. మొదటగా చిక్కిన గొర్రె పిల్లను సగం తిని వదిలి పెట్టాయి. మిగతా వాటిలో 29 గొర్రెలను గాయపరిచి చంపేశాయి. పొలం గట్టు వెంబడి అటుగా వస్తున్న ఓ రైతుకు గొర్రె పిల్లల అరుపు వినపడటంతో వెంటనే గొర్రెల కాపరికి తెలిపాడు. హడావుడిగా వచ్చి కుక్కలను తరిమి కొట్టి చంపేశాడు. రూ. లక్షా యాభై వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. ప్రభుత్వపరంగా మమ్మల్ని ఆదుకోవాలని గొర్రెల కాపరి కలెక్టర్‌ను కోరారు.

భూమి వారిదని వేధిస్తున్నారు...

- పోలీసులను ఆశ్రయించిన మహిళ

నవాబ్‌పేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలోని చౌడూర్ గ్రామ శివారులోని సర్వేనెంబర్ 340, 341లోని 12 ఎకరాల 17 గుంటల భూమి వారిదని ఇటీవల నవాబ్‌పేటకు చెందిన కొంతమంది తమను వేధిస్తున్నారని విద్యావతి అనే మహిళ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ తాము కొంత కాలంగా హైదరాబాద్‌లో జీవిస్తూ ఇటీవల తమ పొలానికి కొత్తగా కంచె వేయగా, కొందరు వ్యక్తులు అడ్డువచ్చి తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. 1954 నుంచి ఈ భూమిపై తమ కుటుంబ సభ్యులే మోఖపై ఉన్నారని.. సర్వే సమయంలో తమకు అనుకూలంగా పొలం చుట్టూ కడీలు పాతించారని అన్నారు. ఈ విషయంపై నవాబ్‌పేట ఎస్ఐ విక్రంను వివరణ కోరగా పూర్తి వివరాలు తెలుసుకుని తహసీల్దార్ సూచనల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య


రాముడు(ఫైల్)

పాన్‌గల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా పాన్‌గల్ మండల పరిధిలోని కదిరేపాడు గ్రామానికి చెందిన చొప్పరి రాముడు(36) మనస్తాపానికి గురై ఆదివారం ఉరి వేసుకొని మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. రాముడు గ్రామంలోని మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం కొన సాగిస్తున్నాడు. కాగా ఇటీవల భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడి మనస్తాపానికి గురై, మామిడి తోటలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య మంజుల, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి సోదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇంటికో అంజన్న


స్వామి వారి దేవాలయం



● ఆ ఊరంతా హనుమాన్ భక్తులే

- ఎక్కువ మందికి హనుమంతుడి పేరు..
- ఆవుపేడ పిడకలతో స్వామి వారికి దీపారాధన
- 2008 వరకు ఆకుల పందిరి కిందే పూజలు
- పరిశుద్ధానందగిరి స్వామి సూచనతో రూ. 50 లక్షలతో గుడి నిర్మాణం


స్వామి మూలవిరాట్టు

ఆ గ్రామంలో దాదాపు ప్రతీ ఇంట్లోనూ ఒక్కరికైనా ఆంజనేయ స్వామిని నిత్యం తలుచుకునేలా గ్రామంలో ఏ ఇంటిని తట్టినా హన్మంతు, అంజిలయ్య, మారుతి, అంజిలమ్మ, హనుమమ్మ, సంజీవ పేర్లతో పిలవబడుతున్నారు. స్వామి వారిని నిత్యం స్మరించేలా పేరు పెట్టుకున్నట్లు ఆ గ్రామంలో ఎవరిని అడిగిన చెపుతారు. గ్రామంలో ప్రజల్లో దాదాపు 50 శాతం వరకు హనుమాన్ పేరు వచ్చేవిధంగా పెట్టుకోవడం గమనార్హం.

మహమ్మదాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండల పరిధిలోని గాధిర్యాల్ గ్రామంలో వందల ఏళ్ల క్రితం కొలువుదీరిన వీరహనుమాన్ భక్తుల పాలిట కొంగుబంగారంగా.. కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా పూజలందుకొంటున్నారు. ప్రతీ శనివారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. శనివారం వచ్చిందంటే చాలు ఆ గ్రామంలోని వీర హనుమాన్ దేవాలయం భక్తులతో కిటకిట లాడుతుంది. శ్రావణ మాసం వచ్చిందంటే ఆ ఊరిలో ఏ ఒక్క ఇంట్లో మందు, మాంసాహారం ముట్టరు. ప్రతీ ఇంట్లో స్వామి పేర తప్పనిసరి పూజలు చేసుకుంటారు. శ్రావణ శనివారాల్లో రామభక్త ఆంజనేయ స్వామికి అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తారు. తమ మొక్కులు తీరిన భక్తులు గండజ్యోతులు సమర్పించి స్వామి వారికి ప్రత్యేక భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తారు. ఆవుపేడ పిడకలతో స్వామి వారికి దీపారాధన చేస్తారు. కార్తీక మాసం అయితే స్వామి వారికి ప్రత్యేక పూజలతో పాటు పండివంటకాలు నైవేద్యంగా సమర్పిస్తారు.

● స్వామి వారి చరిత్ర..

పూర్వకాలంలో విశ్వామిత్ర మహర్షి ముని మనమడైన గాధినందనుడనే మహర్షి ఇక్కడ తపస్సు చేశారని, ఆ సమయంలోనే ఇక్కడ వీరాంజనేయస్వామి విగ్రహం స్థాపించారని చరిత్ర చెబుతుంది. అదే సమయంలో ఆంజనేయస్వామి విగ్రహం ముందే సుమారు 45 అడుగుల ఎత్తున దివ్యమైన భారీ దీపస్తంభాన్ని ప్రతిష్ఠించారని ప్రజలు కథలుగా చెప్పుకుంటారు. ఈ క్రమంలోని మహర్షి గాధినందనుడి పేరు మీదనే గ్రామానికి గాధిర్యాల్ పేరు వచ్చిందని గ్రామంలోని పెద్దలు చెపుతున్నారు. ఎంతో మహిమగల వీరాంజనేయ స్వామి దర్శనం కోసం ఉమ్మడి రంగారెడ్డి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన భక్తులతో పాటు , మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు శ్రావణ, కార్తీక మాసాలతోపాటు, ఉగాది, సంకాంత్రి, హనుమాన్ జయంతి పండుగలకు పెద్ద ఎత్తున వచ్చి స్వామి వారికి కోడెదూడలు సమర్పిస్తారు, వెండి ఆభరణాలు, నగదు రూపేనా హుండీలో సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. ఈ స్వామికి గంటల దేవుడని ప్రతీతి.

● ఆంజనేయస్వామి అంటే చాలాభక్తి



ఆంజనేయ స్వామి అంటే నాకు ఎంతో భక్తి. గాధిర్యాల్ గ్రామంలో స్వామి వారు పిలిస్తే పలికే దేవుడు. ప్రతీ ఇంట్లో స్వామి వారి పేరు ఒక్కరికైనా ఉంటుంది. ఈ స్వామి వారి పేరుతో పిలిస్తే చాలు అనుకున్న పని జరుగుతుందని గ్రామస్థులకు నమ్మకం. శ్రావణం, కార్తీక మాసాల్లో, ఉగాది, సంక్రాంతి, హనుమాన్ జయంతి, దీపావళి అయితే మరింత కనుల పండువగా ఉంటుంది.
- అంజనాచారీ , ఆలయ కమిటీ చైర్మన్

●2008 వరకు గుడి లేదు

గత వందల ఏళ్లుగా స్వామి వారికి గుడి లేదు. పచ్చటి ఆకుల పందిరి కిందే స్వామి వారికి పూజలు చేసే వారు. అసలు స్వామికి గుడి కట్టవద్దు అని పెద్దలు చెపుతుండేవారు. గుడి కట్టినా నదుల నుంచి నీరు, పుణ్యస్థలాల నుంచి మట్టి తీసుకువచ్చి గుడి నిర్మాణానికి ప్రారంభించాలని ప్రచారం జరుగుతుండేది. దీంతో గుడి కట్టకుండా ఆకుల పందిరి కిందే పూజలు చేయాలని చెప్పేవారు. 2008లో పరుశుద్ధనందగిరి స్వామిజీ వీరాంజనేయ స్వామి దేవాలయాన్ని సందర్శనకు వచ్చారు. ఆ సమయంలో ఆంజనేయ స్వామికి గుడినిర్మాణం చేపట్టాలని గ్రామస్థులకు సూచించడంతో గుడి నిర్మాణానికి అదే ఏడాదిలో తొలి అడుగు పడింది. వీరహనుమాన్ విగ్రహాన్ని విశ్వామిత్రుని మునిమనవడు గాధినందనుడు ప్రతిష్ఠించారని మూల విరాట్టును కదిలించకుండా గుడి నిర్మించాలని చూచించారు. దీంతో 2008 ఏడాదిలోనే గుడినిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రామంలో ప్రతీ ఇంటి నుంచి భాగస్వామం ఉండే విధంగా భారీ మొత్తంలో నిధులు పోగుచేశారు. అవేకాకుండా ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్, వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు నిధులు ఇచ్చారు. ఈ గుడి పనులు 2017 వరకు సాగాయి. గుడి నిర్మాణానికి అప్పట్లో రూ. యాభై లక్షల వరకు ఖర్చు చేశారు. 2017 మేలో హనుమాన్ జయంతి సందర్భంగా పరిశుద్ధానందగిరి స్వామిజీ ఆధ్వర్యంలో వేద పండితుల సమక్షంలో స్వామి గుడిని ప్రారంభించారు. అప్పటి నుంచి ప్రతీ ఏటా మే, జూన్ నెలల్లో వచ్చే హనుమాన్ జయంతికి స్వామి వారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తూ వస్తున్నారు. 2021లో రూ.30 లక్షల ఖర్చుతో రోజ్‌వుడ్, టేకుతో రథం తయారు చేయించారు.

● ప్రతీ ఇంట్లో ఆంజనేయస్వామి పేరు తప్పనిసరి



ప్రతీ ఒక్కరికి గ్రామంలో ఇంటి దేవుడు వీరాంజనేయ స్వామి. అందుకు ప్రతి ఇంట్లో కనీసం ఒక్కరికైనా స్వామి వారి పేరు పెట్టుకున్నారు. హనుమమ్మ, హనుమయ్య, అంజిలమ్మ, అంజిలయ్య అంటూ నిత్యం స్వామి వారి పేరు తలుచుకుంటారు. వీరాంజనేయ స్వామి అంటే ఎంతో మహిమగల దేవుడు. మా తాతాలు, ముత్తాతలకాలం నాటి నుంచి ఈ పేర్లు వస్తున్నాయి.
- సందళ్ల అంజిలమ్మ, మాజీ సర్పంచ్, గాధిర్యాల్

కార్తీక మాసం ప్రత్యేకం

కార్తీక మాసం వచ్చిందంటే చాలు ప్రతీ ఇంట్లో పండుగలు నిర్వహిస్తారు. స్వామి వారికి ప్రతి రోజూ అభిషేకం చేసి, వారి ఇళ్లలో భజన, భక్తులకు భోజనం పెట్టిస్తారు. రాత్రి భక్తులచే భజనలు చేయించి ఇంటి నుంచి స్వామి వారి దేవాలయం వరకు నడుచుకుంటూ వెళ్లి ఇంట్లో తయారు చేసుకున్న గంట ఆకారంలో రూపొందించిన బంతి పూల గంటనే వీర హనుమాన్ దేవాలయంలో కడతారు. దాంతో కార్తీక మాసం మొత్తం రాత్రి సమయంలో స్వామి వారి దేవాలయం భజనలతో తెల్లవారుజాము వరకు పండగ వాతావరణం ఉంటుంది.


స్వామి ఊరేగింపు కోసం చేయించిన రథం

మార్షల్ ఆర్ట్స్‌లో రాణించాలి

- డీఎస్పీ వెంకటేశ్వర్లు
- ఉత్సాహంగా అంతర్రాష్ట్ర కరాటే పోటీలు


కరాటే పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మార్షల్ ఆర్ట్స్‌లో రాణించాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. ఏఆర్ స్పోర్ట్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ఇంటర్‌స్టేట్ కరాటే చాంపియన్‌షిప్ నిర్వహించారు. పోటీలను డీఎస్పీ హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రతీ ఒక్కరూ ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. కరాటే విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాక్షించారు. టోర్నీ ఆయా విభాగాల్లో ప్రతిభ చాటి పతకాలు సాధించాలన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని విద్యార్థులకు సూచించారు. ఇంటర్ స్టేట్ కరాటే చాంపియన్‌షిప్‌ను గీతాశ్రీ కైవసం చేసుకొంది. విజేతలకు ఎన్ఎస్ఎస్‌వోఐ ఇండియా చీఫ్ డైరెక్టర్ రవీందర్‌కుమార్ వివిధ విభాగాల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఏఆర్ స్పోర్ట్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఫౌండర్, టోర్నీ ఆర్గనైజర్ రవినాయక్, ఆర్‌కే స్పోర్ట్స్ బుడోకాన్ ఫౌండర్ రవికుమార్, సలహాదారుడు విజయ్‌కుమార్, కరాటే సీనియర్ మాస్టర్లు శంకర్‌నాయక్, వెంకటేశ్ పాల్గొన్నారు.


కరాటేలో పతకాలు సాధించిన విద్యార్థులు

ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ బాలికల జూనియర్ జట్టు ఎంపిక


జడ్చర్లలో హ్యాండ్‌బాల్ బాలికల జూనియర్ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ సభ్యులు

జడ్చర్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): హ్యాండ్‌బాల్ అసోసియేషన్ మహబూబ్‌నగర్ జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం జడ్చర్లలోని మినీస్టేడియంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బాలికల జూనియర్ జట్టును ఎంపిక చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ నెల 29నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు నిజామాబాద్ జిల్లాలోని కల్లాడి గ్రామంలోని ఆలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే 46వ అంతర్‌జిల్లాల పోటీలో పాల్గొనే జిల్లా జట్టును ఎంపిక చేశారు. 16మంది క్రీడాకారులు భార్గవి, శివానీచంద్ర, భవానీ, మీనాక్షి, దీక్షిత, లావణ్య, బిందుప్రియ, నందిని, స్వన్ని, అనిత, మాధవి, అర్పిత, మహేక్, సౌమ్య, లోకేశ్వరీ, హిమబిందులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తఖియొద్దీన్, శంకర్‌నాయక్, హ్యాండ్‌బాల్ క్రీడాకారులు షోయబ్, రోజ, అభిలాష్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోసగాళ్లు!



- రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తానని రూ. 6.40 లక్షలు స్వాహా
- నిరుద్యోగుల నుంచి రూ.లక్షల వసూళ్లు..
- జాబ్ పేరిట యువతులకు గాలం వేస్తున్న మరికొందరు

గద్వాలక్రైం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): హలో సార్.... నేను ప్రభుత్వ కార్యాలయంలో పనిచేస్తున్నాను. మా శాఖలో కొన్ని ఖాళీలు ఉన్నాయి. మీకు ఉద్యోగాలు ఇప్పించే ఏర్పాటు చేస్తాం. అయితే మా సార్ వాళ్లకు కొంత డబ్బులు ఇవ్వాలని నిరుద్యోగులను బురిడీ కొట్టిస్తున్న సంఘటనలు కోకొల్లలు. ప్రభుత్వ శాఖలో ఉద్యోగాల పేరుతో కొందరు కేటుగాళ్లు నిరుద్యోగులను బుట్టలే వేసుకుంటుండగా.. మరికొందరు ఉద్యోగాలు ఇప్పిస్తామని యువతులను లొంగదీసుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు.

మరికొందరు ఏకంగా ఉద్యోగాల పేరిట లక్షలకు లక్షలు వసూలు చేస్తూ తీరా ఉద్యోగాలు ఎప్పుడు ఇప్పిస్తారని గట్టిగా అడిగేసరికి చేతులెత్తేస్తున్న సంఘటనలు జోగుళాంబ గద్వాల జిల్లాలో చోటు చేసుకున్నాయి.

మోసానికి గురైన కొన్ని సంఘటనలు

● గద్వాల జిల్లా కేంద్రంలోని మోమిన్‌మొహల్లా కాలనీకి చెందిన చాకలి నర్సింహ అనే వ్యక్తి నుంచి వనపర్తి జిల్లాకు చెందిన అంకిత, జగదీశ్వర్‌రెడ్డి అనే దంపతులు రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తానని రూ.6.40 లక్షలు కాజేశారు. తీరా ఉద్యోగం ఇప్పించకపోవడంతో గత మూడు రోజుల క్రితం పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు.

● అక్టోబరు నెలలో గద్వాల జిల్లాకేంద్రంలో వైద్యశాఖలో డ్రైవర్‌గా పనిచేసి వదిలేసిన యువరాజు అనే యువకుడు గద్వాల మండల పరిధిలోని ఓ నిరుద్యోగికి ఉద్యోగం ఇప్పిస్తానని రూ.50వేలు, అలాగే వారి స్నేహితులకు కూడా ఇప్పిస్తానని మొత్తం రూ. 2.70 లక్షలను కాజేయడంతో అతనిని పోలీసులు అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు.

● గద్వాల జిల్లా కేంద్రంలోని కొత్త హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన ఇర్ఫాన్ అనే యువకుడు గద్వాల మండల పరిధిలోని ఓ యువకుడికి కలెక్టరేట్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి రూ. మూడు లక్షలు కాజేశాడు. దీంతో ఆగస్టు నెలలో బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పట్టణ ఎస్ఐ శ్రీనివాస్ రిమాండ్‌కు తరలించారు.

● సెప్టెంబరు 3న జిల్లా కేంద్రంలోని తెలుగుపేట కాలనీకి చెందిన టీజీ రాజు అనే వ్యక్తి ఉద్యోగం ఇప్పిస్తానని ఆదే కాలనీకి చెందిన మహిళతో చనువు పెంచుకునేందుకు తరచుగా వాట్సాప్ కాల్స్, చాటింగ్ చేస్తూ ఆ మహిళకు ఉద్యోగం ఇప్పించకపోగా ఇబ్బందులకు గురిచేయడంతో ఆతనిపై పట్టణ పోలీసులు కేసును నమోదు చేశారు.

● అక్టోబరు 27న జిల్లా కేంద్రంలోని వైద్య శాఖలో ఏఎన్ఎం పోస్టులు ఇప్పిస్తానని పలువురు యువతులకు ఆంజనేయులు అనే అగంతకుడు ఫోన్ చేసినట్లు బాధితులు, వైద్యసిబ్బంది తెలిపారు. ఇందులో కొందరు యువతులు ఇది తెలియక అతనికి రూ. 25వేలు, రూ. 50 వేలు చెల్లించి ఫేక్ సర్టిఫికెట్స్ పొందినట్లు వైద్యసిబ్బంది తెలిపారు. ఇలా ఎందరినో నిరుద్యోగులను ఉద్యోగాల పేరిట మోసాలు చేస్తున్న సంఘటనలుజిల్లాలో తారసపడుతున్నాయి.


రూ. లక్షలు వసూలు చేస్తూ.... జల్సాలు

నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తామని వారినుంచి లక్షలు వసూలు చేస్తూ జల్సాలు చేస్తూ నిరుద్యోగులను అప్పుల పాలు చేస్తున్నారు. తమకు ఉద్యోగం వస్తుందన్న ఆశతో ఆ కేటుగాళ్లు చెప్పేమాటలను నమ్మి తల్లిదండ్రులను ఒప్పించి వారి నుంచి అప్పులు తెప్పించి ఈ కేటుగాళ్లకు ఇస్తున్నారు. డబ్బులు పడిన వెంటనే ఇక నిరుద్యోగుల ఫోన్‌లకు సమాచారం రాకపోగా వారిఫోన్‌లు స్విచ్ఛాఫ్ చేసుకుంటున్నారని బాధితులు తెలిపారు. కొందరు ఇక్కడి నిరుద్యోగులను మోసం చేసేందుకు హైదరాబాద్‌లో ఉన్న సెక్రటరేట్‌లో సైతం తమకు సంబంధించిన వారు ఉన్నారని, మీరిచ్చే డబ్బులు వారికి పంపితే వెంటనే ఉద్యోగాలు వస్తాయని నమ్మించి నిరుద్యోగులను ముంచేస్తున్నారు. ఇన్ని జరుగుతున్నా నిరుద్యోగులలో ఆశలు మాత్రం చావక కేటుగాళ్ల వలకు చిక్కేస్తున్నారు.

● స్వచ్ఛంద సంస్థల పేరుతో కొందరు

జిల్లాలో కొందరు నాయకులు స్వచ్ఛంద సంస్థల పేరుతో చలామణి అవుతూ ప్రైవేట్ ఏజేన్సీలు ఉన్నాయని చెబుతూ మరి కొందరిని నమ్మించి వారినుంచి డబ్బులను వసూలు చేస్తున్నట్లు తెలుస్తుంది. గతంలో ఇలా వందల సంఖ్యలో నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసిన ఈ వసూల్‌రాజాను పోలీసులు కేసును కూడా నమోదు చేశారు. అయినప్పటికీ ఆయన ఆగడాలకు అంతులేకుండా పోతున్నట్లు తెలుస్తున్నది.

ఉద్యోగాల పేరిట మోసపోవద్దు..



ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను మోసం చేస్తే సహించేది లేదని, వారిపై కేసులు నమోదు చేస్తాం. నిరుద్యోగ యువతీ, యువకులు వారి ఉద్యోగాల పేరిట డబ్బులు అడిగేవారి వివరాలపై పోలీసులకు సమాచారం ఇవ్వండి. ప్రతీ శాఖలో కూడా నేడు మెరిట్ ఆధారంగానే ఉద్యోగం వస్తుందన్న విషయం ప్రతీ నిరుద్యోగి గమనించాలి. డబ్బులు అడిగారంటే వారు మోసం చేసే వారనే విషయం గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

- సత్యనారాయణ, డీఎస్పీ

టీజీపీడీ, పీఈటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా దూమర్ల


టీజీపీడీ, పీఈటీ అసోసియేషన్ ఎన్నికైన జిల్లా పీడీలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఫిజికల్ డైరెక్టర్స్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ రాష్ట్ర అధ్యక్షుడిగా జిల్లా కేంద్రానికి చెందిన పీడీ దూమర్ల నిరంజన్ నియమితులయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశంలో దూమర్లను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. సంయుక్త కార్యదర్శి నారాయణపేటకు చెందిన పీడీ రమణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన పీడీ నిరంజన్‌యాదవ్‌కు రాష్ట్ర కమిటీలో చోటు దక్కింది. రాష్ట్ర కమిటీలో జిల్లా వాసులకు చోటు దక్కడం పట్ల వ్యాయామ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

న్యూస్ బాక్స్

నేడు డెడికేటెడ్ బీసీ కమిషన్ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానికసంస్థల వారీగా కల్పించే అవసరమైన రిజర్వేషన్ల దామాషా పేర్కొనే విషయంపై నేడు కలెక్టరేట్‌లో డెడికేటెడ్ బీసీ కమిషన్ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ విజయేందిర బోయి ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహించే ఈకార్యక్రమానికి కమిషన్ చైర్మన్ బుసాని వెంకటేశ్వరరావు, కార్యదర్శులు బి.సైదులు హాజరవుతారని, ఆయా కులాల పరిస్థితులపై అభిప్రాయాలను వ్యక్తం చేయవచ్చని తెలిపారు. స్థానిక సంస్థలకు అవసరమైన రిజర్వేషన్లను దామాషా ప్రకారం కల్పించేందుకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీలు, బీసీ సంఘాలు, ప్రజలు, సలహాలు, అభ్యర్థనలు, మెటీరియల్, సాక్ష్యాలతో సమర్పించవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ నేపథ్యంలోనే కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ విజయేందిర బోయి ఆదివారం మరో ప్రకటనలో పేర్కొన్నారు.

శ్రీరామకొండ, ఖిల్లాపై చిరుత సంచారం

- భయాందోళనలో ప్రజలు

కోయిలకొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఖిల్లా, శ్రీరామకొండపై చిరుత సంచారం చేస్తున్నదని పలువురు స్థానికులు తెలిపారు. ఆదివారం చిరుత సంచారాన్ని మేకల కాపరులు గమనించి భయాందోళనకు గురయ్యారు. ఉదయం మేకలను ఖిల్లా గుట్టపైకి మేపేందుకు తీసుకెళ్లగా దూరంగా కనిపించిందని తెలిపారు. గత కొన్నిరోజులుగా చిరుతలు సంచరిస్తున్నాయని చెప్పారు.

19న మూసాపేటకు కాశీ జగద్గురు రాక

మూసాపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా మండల పరిధిలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయానికి శ్రీ 1008 కాశీ జగద్గురు జ్ఞానసింహాసనాధీశ్వర డాక్టర్ చంద్రశేఖర శివచార్య మహాస్వాముల వారు ఈనెల 19 మంగళవారం ఉదయం 10:30 గంటలకు సందర్శిస్తారని ఆలయ కమిటీ అధ్యక్షుడు నరేం దర్‌సాగర్ తెలిపారు. కార్యక్రమానికి మండల ప్రజాప్రతినిధులు, గ్రామాలపెద్దలు, యువకులు, భక్తులు తరలిరావాలని కోరారు.

ఘనంగా బంగారు మైసమ్మ ఆలయ వార్షికోత్సవం

జడ్చర్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల మున్సిపాలిటీలోని కావేరమ్మపేట సమీపంలోని బంగారు మైసమ్మ ఆలయ 9వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతిపూజ, పుణ్యాహవాచనం, కుంకుమార్చన నిర్వహించిన అనంతరం అమ్మవారికి పంచామృతాభిషేకం చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చైతన్యచౌహాన్, కమిటీ సభ్యులు గోనెల నరేందర్, గుండు చంద్రశేఖర్, విజయ్‌కుమార్, శ్రీశైలం, శివకుమార్, నాగరాజు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- నత్తనడకన పనులతో హైవేపై నిలిచిపోతున్న వాహనాలు

బాలానగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణ కోసం బాలానగర్ మండల కేంద్రంలోని ముఖ్య కూడలి 44వ నంబరు జాతీయ రహదారిపై నిర్మాణం చేస్తున్న జాతీయ రహదారుల సంస్థ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు చేపట్టింది. ఈ నిర్మాణ పనులు వారం రోజులుగా నత్తనడకన సాగుతున్నాయి. దీంతో మండల ప్రజలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పనులు త్వరగా చేపట్టే కార్యక్రమంలో భాగంగా కాంట్రాక్టర్ ముఖ్య రాహదారిపై వాహనాలను సర్వీస్ రోడ్డుపైకి మళ్లించారు. దీంతో అప్పుడప్పుడు ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోతున్నది. ఈ సమయంలో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిని మూసివేయడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రత్యామ్నాయంగా మరో సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని అలాగే ఫ్లైఓవర్ నిర్మాణ పనులు వేగవంతం చేసి వాడుకలోకి తేవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కొమ్మల తొలగింపుతో సజావుగా విద్యుత్ సరఫరా

మూసాపేట,నవంబరు17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఆదివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. విద్యుత్ తీగలకు తాకే లైన్లపై ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి సరఫరాను పునరుద్ధరించారు. కాగా జానంపేట ఉపకేంద్రం పరిధిలో ఇక కూడా చాలా చోట్ల తీగలను ముళ్లపొదలు కమ్మేయడంతో ఎర్తింగ్ సమస్యలు తలెత్తి వినియోగదారులు ఇబ్బందిపడుతున్నారు. ఈ తీగలను కూడా సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

కొనసాగుతున్న సర్వే

మూసాపేట, నవంబరు17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి సర్వే మండలంలో ఆదివారం కూడా కొనసాగింది. సర్వేలో ఎన్యుమరేటర్లు వారికి కేటాయించిన ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు.

వార్డుల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

- మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్
- క్రమం తప్పకుండా తాగునీటి సరఫరాకు కృషి


పీఆర్‌కాలనీలో సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న పుర చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్

మహబూబ్‌నగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పాలమూరు పురపాలిక పరిధిలోని అన్ని వార్డులలో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పని చేస్తామని మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్ అన్నారు. ఆదివారం 8వ వార్డులోని పంచాయతీరాజ్ కాలనీలో రూ.15 లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనీల్లో నెలకొన్న సమస్యలపై ప్రధానంగా దృష్టి సారించడం జరిగిందని, అన్ని వార్డులలో సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు చేపడుతున్నామని తెలిపారు. క్రమం తప్పకుండా తాగునీరు అందించడం, రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ సమస్యలు లేకుండా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నీరజవిఠల్ రెడ్డి, నాయకులు రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, స్వాములు, వెంకటేశ్వర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, రాజన్నగౌడ్ పాల్గొన్నారు.

వైద్యశిబిరం ఏర్పాటు అభినందనీయం


ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఫోరం అధ్యక్షుడు జగపతిరావు

మహబూబ్‌నగర్ టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి పేదలకు సేవ చేయడం అభినందనీయమని మహబూబ్‌నగర్ సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు అన్నారు. ఆదివారం హన్వాడలోని ఆరోగ్య ఉపకేంద్రంలో మహబూబ్‌నగర్ న్యూటౌన్‌లోని ఎంకె హాస్పిటల్స్ వారి సౌజన్యంతో మండల సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా పేదలు నివసిస్తుంటారని వా రు ఆరోగ్యం పట్ల ఎక్కువ గా శ్రద్ధ చూపరని, మానవతా దృక్పథంలో ఎంకె ఆసుపత్రి వారు ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసి అన్ని పరీక్షలు నిర్వహిస్తూ మందులు పంపిణీ చేయడాన్ని అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్లు మహేష్ కుమార్, కరుణరాథోడ్, సందీప్, మాళవిక, అఖిల, మేనేజర్ బాలు, మండల సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు రామచంద్రయ్య, కార్యదర్శి కొండ వెంకటయ్య, నారాయణ, కేశవరెడ్డి, గౌస్, గణపతినాయక్, కొండ వెంకటయ్య, జిల్లా ఫోరం నాయకులు అక్కినేని నారాయణరావు, రాజసింహుడు, బుచ్చన్న పాల్గొన్నారు.

ఎంఎస్‌సీ వృక్షశాస్త్రంలో స్పాట్ అడ్మిషన్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

జడ్చర్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఎంఎస్‌సి వృక్షశాస్త్రంలో స్పాట్ అడ్మిషన్‌ల కోసం ఈనెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ సుకన్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నిర్వహించిన ప్రవేశ పరీక్ష రాసిన వారు, రాయని వారు సైతం ఎంఎస్‌సీలో చేరవచ్చని పేర్కొన్నారు.

డిగ్రీలో వృక్షశాస్త్రం ఒక సబ్జెక్ట్‌గా చదివిన విద్యార్థులు 50శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని, ఆసక్తి గల విద్యార్థులు స్పాట్ అడ్మిషన్‌ల కోసం ఈనెల 20న కళాశాలలో నేరుగా హాజరు కావాలని సూచించారు.

రాజ్యాంగాన్ని అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలం

- న్యాయవాదులపై దాడులు జరుగుతున్నా పట్టని వైనం
- హెల్త్, డెత్ బెనిఫిట్ స్కీమ్స్‌ను రూ.20లక్షలకు పెంచాలి



మాట్లాడుతున్న ఐఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్

పాలమూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల రక్షణ చట్టం అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఇండియన్ అసోసియేషన్ లాయర్స్ యూనియన్ మహాసభలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్రంలో న్యాయవాదులపై దాడులు జరుగుతున్నా వారికి రక్షణ చట్టం తీసుకురావటంలో పాలకవర్గాలు వెనుకంజ వేస్తున్నాయని అన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటకాలం నుంచి మొన్న జరిగిన తెలంగాణ పోరాటంలో న్యాయవాదుల పాత్ర అమోఘమైందన్నారు. భారత రాజ్యాంగాన్ని అమలు చేయడంలో పాలకులు వెనుకంజ వేస్తున్నారని చెప్పారు. సెక్షన్ 41సీఆర్‌పీసీని తక్షణం ఎత్తేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జూనియర్ న్యాయవాదులకు రూ.5000 ప్రతినెలా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

హెల్త్, డెత్ బెనిఫిట్ స్కీమ్స్‌ను రూ.20లక్షలకు పెంచాలన్నారు. ప్రతి జిల్లాలో ఇళ్లులేని న్యాయవాదులకు ఇళ్లు కేటా యించాలని ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలన్నారు. న్యాయవాదుల వృత్తి రక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. జూనియర్ న్యాయవాదులు తమ వృత్తిపట్ల నిబద్ధతతో ఉండి వృత్తిలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో బి.ఆర్ విల్సన్, బి.రాము, దత్తాత్రేయ, రమేష్, ఆర్ఆర్ మణ్యం, శేఖరయ్య, జేసీ కుర్మయ్య, నిరంజన్, సలీం, వెంకట్రావు, జగదీష్, రాజు, చేతన, ఎన్.వి మహేష్, నరసింహ, రామకృష్ణగౌడ్, ఉబేద్, సజ్జత్, అమేద్, వేణుగోపాల్ గౌడ్, శివరాం తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

యువత సరైన మార్గంలో నడుచుకోవాలి

- భూత్పూర్ చేరిన విశ్రాంత డీఈవో విజయకుమార్ పాదయాత్ర - కేజీబీవీ, బాలికల గురుకుల విద్యాలయాల సందర్శన


కస్తూర్బా పాఠశాలలో సత్యశోధన కార్యక్రమానికి హాజరైన విద్యార్థినులు, విజయకుమార్‌కు జ్ఞాపికను అందజేస్తున్న విద్యార్థినులు

భూత్పూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని యువత సరైనమార్గంలో నడుచుకోవాలని విశ్రాంత డీఈవో విజయకుమార్ అన్నారు. మహాత్మాగాంధీబాటలో సత్యశోధన పాదయాత్ర ఆదివారం జడ్చర్ల నుంచి భూత్పూర్ చేరుకుంది. 100 రోజులు 1000 కిలోమీటర్లు కొనసాగే పాదయాత్ర అక్టోబరు 2న గాంధీ జయంతిన అలంపూర్‌లోని జోగులాంబ ఆలయంలో ప్రారంభమై అయిజ, గట్టు, మల్దకల్, గద్వాల, జూరాల ప్రాజెక్టు మీదుగా మహబూబ్‌నగర్ చేరుకుని అటు నుంచి నవాబ్‌పేట జడ్చర్లకు చేరుకుంది. నేడు పిల్లలు, విద్యార్థులు, యువత సరైన దిశానిర్దేశం లేకపోవడంతో చెడు వ్యసనాలు, అలవాట్లకు బానిసలవుతున్నారు.

తల్లిదండ్రులు, గురువుల పట్ల చూపాల్సిన గౌరవ మర్యాదలను విడనాడి క్రమశిక్షణ లేక అల్లరి చిల్లరగా తిరుగుతూ అసభ్యకర ప్రవర్తనకు లోనవుతున్నారు. ఈ ఆవేదనతో గాంధీజీ ఆశయాలను బోధిస్తూ జీవన విధానాన్ని వివరిస్తూ కాలినడకన పాదయాత్రకు శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. ఇంతవరకు 47రోజుల్లో 510 కిలోమీటర్లు పూర్తిచేశానని, సుమారు 20వేల మంది విద్యార్థులకు సందేశాలను తీసుకెళ్లినట్లు చెప్పారు.

భూత్పూర్‌లో కేజీబీవీ విద్యాలయం, బాలికల గురుకుల విద్యాలయాలను సందర్శించి గాంధీజీ ఆశయాలు, సిద్ధాంతాలను వివరించారు.

లిడ్‌క్యాప్‌ను ప్రారంభించి ఉపాధి కల్పించాలి

- కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుర్మయ్య, జిల్లా అధ్యక్షుడు మాణిక్యంరాజు



జడ్చర్లలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుర్మయ్య

జడ్చర్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలేపల్లి సమీపంలోని లిడ్‌క్యాప్‌ను ప్రారంభించి చర్మకారులకు ఉపాధి కల్పించాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుర్మయ్య, జిల్లా అధ్యక్షుడు మాణిక్యంరాజు డిమాండ్ చేశారు. జడ్చర్ల పట్టణంలోని అంబేద్కర్ కళాభవన్‌లో ఆదివారం నిర్వహించిన కేవీపీఎస్ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న సందర్భంగా వారు మాట్లాడారు. లిడ్‌క్యాప్‌నకు 15 సంవత్సరాల క్రితం సుమారు 12 మంది దళితులు భూమిని ఇచ్చారని, వారికి నేటికీ పరిహారం అందలేదన్నారు. లిడ్‌క్యాప్ ఏర్పాటు చేసి చర్మకారులకు శిక్షణ అందించారని, వారికి ఉపాధి కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలోని చర్మకారులందరికీ రుణాలు అందజేసి ఆదుకోవాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లను మూడు విడతలుగా ఇస్తామని వెల్లడించిన రాష్ట్ర ప్రభుత్వం, దళితులకు మొదటి దఫాలోనే ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో కులాంతర వివాహం చేసుకున్న వారికి రూ.5లక్షలు ఆర్థిక సహాయం అందజేయాలని కోరారు. సమావేశంలో నాయకులు జగన్, నాగరాజు, రమేశ్, పవన్, ఆంజనేయులు, బాల్‌చెన్నయ్య, రామచంద్రయ్య మల్లేష్, మణ్యం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ కేజీ వీల్స్‌తో బీటీ రోడ్డుకు పగుళ్లు


పాడైన గాజులపేట బీటీరోడ్డు

మూసాపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గాజులపేట స్టేజీ 44వ జాతీయ రహదారి నుంచి గాజులపేట గ్రామానికి వెళ్లే బీటీరోడ్డుపై రైతులు ఇష్టానుసారంగా ట్రాక్టర్‌ను కేజీ వీల్స్‌తో నడిపించడంతో బీటీరోడ్డు చాలాచోట్ల ధ్వంసమైంది. కంకర తేలింది. రెండునెలల కిందట కురిసిన వర్షాలకు రోడ్డుపై లోతైన గుంతలుపడటంతో పాటు పగుళ్లు ఏర్పడ్డాయని పలువురు ప్రయాణికులు, స్థానికులు తెలిపారు. ఈవిషయంలో సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి తగుచర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పరీక్ష బందోబస్తును పర్యవేక్షించిన ఎస్పీ


పాలమూరులో పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థులతో మాట్లాడుతున్న ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, నవంబరు17(ఆంధ్రజ్యోతి): రెండ్రోజుల పాటు నిర్వహించే గ్రూప్-3 పరీక్షలకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద అభ్యర్థులను తనిఖీ చేసి కేంద్రంలోపలికి అనుమతించారు. ఆదివారం పాలమూరులో పలుపరీక్ష కేంద్రాలను ఎస్పీ జానకి సందర్శించారు. బందోబస్తుపై తీసుకోవాల్సిన చర్యలను పోలీసులకు సూచించారు. సోమవారం కూడా పరీక్ష నిర్వహించనున్నందున పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చూడాలని ఆదేశించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ


హన్వాడలో కొనుగోలు కేంద్రం వద్ద వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మోహన్‌రావు

హన్వాడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): హన్వాడలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం అదనపు కలెక్టర్ మోహన్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడి, పలువివరాలు తెలుసుకున్నారు. అనంతరం నిర్వాహకులతో మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

కొనసాగుతున్న కార్తీక దీపారాధన


మహబూబ్‌నగర్‌లోని కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద కార్తీక దీపారాధన చేస్తున్న భక్తులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్ నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస పూజలలో భాగంగా ఆదివారం పట్టణంలోని ఆలయాల్లో దీపారాధన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. బ్రాహ్మణవాడిలోని కన్యకా పరమేశ్వరి ఆలయం, వీరన్నపేటలోని పెద్దశివాలయం, పరిమళగిరిలోని వీరాంజనేయస్వామి ఆలయం, బస్టాండ్ సమీపంలోని రేణుక ఎల్లమ్మ ఆలయం, సాయిబాబా ఆలయం. రాఘవేంద్రస్వామి ఆలయం, బండమీదిపల్లిలోని శివాలయంలో భక్తులు కార్తీకమాసం 17వ రోజు దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా వాసవీ ఆలయంలో ప్రధాన అర్చకుడు గుండాల రాఘవేంద్రశర్మ భక్తులకు కార్తీక దీపాల విశిష్టతను వివరించారు.

కార్తీకమాసంలో శివాలయంలో ఒక దీపం వెలిగించిన అది అశ్వమేధయాగ ఫలితాన్ని ఇస్తుందని వివరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ పూజా కార్యక్రమాలలో ఆయా ఆలయ కమిటీల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కురుమూర్తి జాతరలో పీకెల మోత

- బెంబేలెత్తుతున్న భక్తజనం
- పోకిరీల బెడదతో భక్తులకు ఇబ్బందులు


కురుమూర్తి జాతరలో పీకెల విక్రయాలు

చిన్నచింతకుంట, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలోని కురుమూర్తి వేంకటేశ్వర స్వామి వారి జాతరలో పీకెలమోతతో భక్తజనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జాతరలో ఇతర రాష్ట్రాలకు చెందిన చిరువ్యాపారులు అధికంగా సౌండ్ వచ్చే ప్లాస్టిక్ పీకెలను విక్రయిస్తున్నారు. పోకిరీలు వాటిని కొనుగోలు చేసి ఊదుతుండడంతో ఆ సౌండ్‌కు భక్తులు జనం బెంబేలెత్తుతున్నారు. వివిధ దుకాణాల వద్ద, దారి పొడవునా చెవులకు చిల్లులు పడేలా పీకెలమోతతో విసిగిస్తున్నారు. స్వామివారికి దాసంగాలను సమర్పించేందుకు వచ్చిన భక్తులకు తీవ్ర ఇబ్బందులు తప్పటంలేదు. సంబంధిత అధికారులు, పోలీసులు జాతరలో పీకలను నిషేధించేలా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

కురుమ, యాదవుల అభ్యున్నతికి కృషి

- కాంగ్రెస్ నాయకుడు శివకుమార్‌రెడ్డి
- సదర్ ఉత్సవాలను అధికారికంగా నిర్వహించడం సంతోషకరం


దమయపల్లిలో సదర్ ఉత్సవాల్లో మాట్లాడుతున్న శివకుమార్‌రెడ్డి

కోయిలకొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కురుమ, యాదవుల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని నారాయణపేట కాంగ్రెస్ నాయకుడు కే.శివకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని దమాయపల్లిలో కురుమ, యాదవుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ ఉత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి కృషితో సదర్ ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలని ఆదేశించడం సంతోషదాయకమని అన్నారు. సదర్ ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివరెడ్డి, బీజేపీ నాయకులు సత్య యాదవ్, మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వై.విద్యాసాగర్‌గౌడ్ యాదవ సంఘం నాయకులు మల్లయ్య, మొగులయ్య, నారాయణయాదవ్, పారుపల్లి యాదయ్య, హన్మంతు యాదవ్‌తో పాటు మండలంలోని యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.